క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన



బంగారువలసలో ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి సభ్యులు

మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామంలో శుక్రవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక కమిటీ సభ్యుడు రామినాయుడు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత అర్థం తెలుసుకుని, ఆచరిస్తే జ్ఞానం సంప్రదాయంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ గోపాలకృష్ణ, ధనుంజయ్, రమేష్, చిన్నమ్మ, ధనుష్, లావణ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలు చేస్తే చర్యలు



నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

సాలూరు: మున్సిపాలిటీలో అనధికార నిర్మాణాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జయరాం హెచ్చరించారు. ఈ మేరకు పట్టణంలోని 1వ సచివాలయ పరిధి రైల్వేస్టేషన్‌రోడ్డు సమీపంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం ఆయన సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. నిర్మాణాలకు సంబంధించిన పత్రాలపై ఆరా తీసి, నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఇటువంటి అనధికార నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేసి, నిర్మాణాలు వెంటనే నిలుపుదల చేయాలని టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, ప్లానింగ్ సెక్రటరీ ప్రియాంకలకు కమిషనర్ ఆదేశించారు.

27,28 తేదీల్లో కార్మిక, రైతు మహాధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణరావు

సీతంపేట: ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో కార్మిక, రైతు మహాధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, రైతులకు వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కళ్లద్దాల పంపిణీ



విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి, తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించుకున్న విద్యార్థినులకు శుక్రవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎ. లిల్లీరాణి మాట్లాడుతూ, క్రమంతప్పకుండా కళ్లద్దాలు ధరించాలని సూచించారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో 24 మంది లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ పీడీ రమేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సహాయంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మాధవరావు, సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం చేకూరుతుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. శుక్రవారం స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభకు హాజరైన వారు మాట్లాడుతూ భగవంతుడి నామాన్ని నిత్యం స్మరణ చేస్తూ ఉంటే సర్వపాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమని, ప్రతి ఒక్కరూ భగవంతుడి నామాన్ని జపించాలన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు మాస్టారు, పండిత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



సీతానగరం: కామందొరవలసలో నాగదేవత పూజ కోసం సామగ్రితో ఉన్న మహిళలు

నాగుల చవితి పర్వదినాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రజలు ఉపవాసాలతో ఉండి నాగదేవతను పూజించడానికి గ్రామశివారుల్లో ఉన్న పుట్టలవద్ద తంగేడు పూలు, పసుపు కుంకుమ, చలివిడి, చిమ్మిలి, కోడిగుడ్లు, పాలు, నాగుల గావంచాలతో వెళ్లి చదును చేసిన పుట్ట వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పుట్టలో చలివిడి, గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చారు.



పార్వతీపురం టౌన్: సంగంవలస గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: గుచ్చిమిలో పుట్టవద్ద పూజలు చేస్తున్న బంకురు కుటుంబీకులు



మక్కువ: పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



బలిజిపేట: వెంగాపురంలో పూజలు చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: పట్టణ శివారులో పూజలు నిర్వహిస్తున్న ప్రజలు



మక్కువ: నాగులచవితి పండగ జరుపుకునేందుకు పుట్టకు చేరుకున్న భక్తులు



సాలూరు: శివరాంపురంలోని నాగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సాలూరు: మండలంలోని గ్రామాల్లో పుట్టలో పాలు వేసి పూజలు చేస్తున్న భక్తులు

మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి

బలిజిపేట: గతంలో ఏవిధమైన స్కీమ్‌లోనూ లబ్ధిపొందని వారికి కొత్త మరుగుదొడ్లు కావాలంటే మంజూరుచేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కార్యదర్శులకు సూచించారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మరుగుదొడ్లు, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించారు. గతంలో వివిధ పథకాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేసినవారు ఉన్నారని, వారు కాకుండా ఇప్పటివరకు ఏ స్కీమ్‌లోనూ మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టని వారుంటే వారికి అవసరముంటే కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ నెల 21వ తేదీ నుంచి ఒక సచివాలయానికి మూడురోజుల వంతున నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయాల వారీగా సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా సచివాలయాల్లో ఇచ్చే శిక్షణకు సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. వచ్చేనెల 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణ ఉంటుందని దానిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలి

- డీఐఓ జగన్మోహనరావు



వ్యాక్సిన్ నిల్వలపై మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

సీతానగరం: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని జిలా ఇమ్యునైజేషన్ (డీఐఓ) అధికారి డాక్టర్ టి జగన్మోహనరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం పిహెచ్‌సీని సందర్శించి వాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో గర్భిణులకు పక్కాగా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు చేసి వారిలో ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించవచ్చని, ఈ పరీక్షల్లో హైరిస్క్‌తో ఉన్న వారిని క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం అందుబాటులో ఉందని, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య సేవల నిమిత్తం ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఫార్మసిస్ట్, టెక్నీషియన్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రూ.1.21 కోట్లతో తాగునీటి సదుపాయం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామపంచాయతీలో రూ.1.21 కోట్ల వ్యయంతో ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నామని సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు శుక్రవారం తెలిపారు. గ్రామంలో పైపులైన్, వాటర్ ట్యాంక్ ఏర్పాటు నిమిత్తం రూ.52.80 లక్షలు, మొగిలివలసలో పైపులైన్, వాటర్ ట్యాంక్ ఏర్పాటు కోసం రూ.68.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇవే కాకుండా జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు కూడా ఇస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



సీతానగరం: లచ్చయ్యపేటలో పడిపూజ చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో దేవాలయాలు, సన్నిధానాలలో వందలాది మంది అయ్యప్ప దీక్షలు తీసుకుని భక్తిశ్రద్ధలతో దీపావళి నుంచి అంబలం పూజలు, పడి పూజలు చేస్తున్నారు. ఈ మేరకు లచ్చయ్యపేట కాలనీలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించడానికి ముందుగా అరటి డొప్పలతో 18 మెట్లు కట్టి పై భాగాన వినాయక , అయ్యప్పస్వామి, కుమారస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన 18మెట్లపై ఒక్కోదేవుడి ప్రతిమను అధిష్టించి జ్యోతులు వెలిగించి వివిధ రకాల పూలతో అలంకరించి వందలాది మంది భక్తులతో అర్చకులు బుధవారం రాత్రి 8గంటలనుంచి 11 గంటల వరకూ అయ్యప్ప పూజ, భజన, శరణు ఘోష చేయించారు.

హరోం...హర..

పార్వతీపురంటౌన్: కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పార్వతీపురం పట్టణంలో గల అతి పురాతనమైన ఎస్ఎన్‌పీ కాలనీ, అడ్డాపుశీల, పశుపతినాథ్ ఆలయాల్లో వేకువజామునుంచి భక్తులు క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. విశేష అలంకరణలో ఉన్న శివలింగాలకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.




పార్వతీపురం టౌన్: బైపాస్ శివాలయంలో ప్రత్యేక అలకరణలో స్వామివారు



పార్వతీపురం టౌన్: పశుపతినాథ్ ఆలయంలో స్వామివారు

సందడిగా బోడిమెట్ట యాత్ర



బోడిమెట్ట ఎక్కుతున్న భక్తులు

వీరఘట్టం: మండల కేంద్రానికి సమీపంలో గల అచ్చెపువలసలో బోడిమెట్ట యాత్ర శుక్రవారం సందడిగా జరిగింది. ప్రతి ఏటా నాగులచవితి రోజున బోడిమెట్ట అధిరోహించడం ఆనవాయితీగా వస్తోంది. మండలం నలుమూలల నుంచి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వచ్చి బోడిమెట్టను అధిరోహించి, బాణసంచా కాల్చారు. అంతకుముందు సమీపంలోని గోవిందమ్మ పేరంటాలును దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పక్కాగా కులగణన

వీరఘట్టం: ఈ నెల 27 నుంచి వీరఘట్టం మండలంలో జరగనున్న కులగణనను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ వై.వెంకటరమణ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కులగణనపై సమీక్ష నిర్వహించారు. గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కులగణన చేపట్టాలని సూచించారు. కులగణనను పర్యవేక్షించేందుకు ఆరుగురు మండల స్థాయి అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఈఓపీఆర్‌డీ, వ్యవసాయశాఖ ఏఓ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఉపాధిహామీ ఏపీఓ, వెలుగు ఏపీఎం , డిప్యూటీ తహసీల్దార్ సభ్యులుగా ఉంటారన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ టి.రమణమూర్తి, వీరఘట్టం ఈఓ వి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



మల్లి గురుకులంలో క్రీడా పోటీలు

సీతంపేట: జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పాఠశాల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మల్లిలో ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్‌దయానంద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు ప్రారంభం



కోత పనుల్లో నిమగ్నమైన కూలీలు

రేగిడి: మండల వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. చేతికందివచ్చిన పంటను కోసి, కళ్లాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం బాగా అనుకూలించడంతో పంట దిగుబడి కూడా బాగా వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో వరికోతలు జరుగుతున్నాయి.

కులగణన సర్వేపై శిక్షణ



బలిజిపేట: శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ ఏఎస్ఓ విజయరావు



సీతానగరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

బలిజిపేట: ఈనెల 27నుంచి ప్రారంభం కానున్న కులగణన సర్వేపై మాస్టర్ ట్రైనీ ఏఎస్ఓ విజయరావు కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ కులగణన కార్యక్రమంలో ముందుగా కార్యదర్శులు ఈనెల 20నుంచి 25వరకు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, దండోరా రూపంలో తెలియజేయాలని చెప్పారు. సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉండాలని స్పష్టం చేశారు. నిర్ధారించిన యాప్‌లో కులగణన సర్వేను చేయాలని సూచించారు. 27వ తేదీన గణన ప్రారంభించి వారంరోజుల్లో పూర్తిచేయాలని, ప్రతి కులాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మండలంలో ఎంపీడీఓ విజయలక్ష్మితో పాటు తాను మాస్టర్ ట్రైనీలుగా శిక్షణ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కులగణనకు సన్నద్ధం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వలంటీర్లతో కులగణన చేయడానికి సచివాలయ ఉద్యోగులు సన్నద్ధం చేయాలని ఎంపీడీఓ బి కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండల సహాయగణాంక అధికారి సతీష్ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

210 మంది నిరుపేద రైతులకు పట్టాలు


- పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో భూమిలేని నిరు పేదకుటుంబాలను గుర్తించి వారికి ఉచితంగా భూమి పట్టాలను పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిరుపేద రైతులు 210 మందికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ననుసరించి ఒక్కో ఫోల్డర్‌లో ప్రభుత్వం సమకూర్చిన భూమికి సంబంధించిన పట్టా, సీఎం సందేశం కాపీ,అడంగల్ కాపీ, వన్-బీ కాపీ, భూమి ఎక్కడుందో తెలియజేసే మ్యాప్ కాపీని పొందుపర్చినట్లు తెలిపారు. ఈ పట్టాలను మండలంలోని నిడగల్లు, చినంకలాం, సూరంపేట గ్రామాల్లో నిరుపేద రైతులకు త్వరలో పంపిణీ చేయనున్నామని వివరించారు.

వైభవంగా నందెన్న అనుపోత్సవం



అనుపోత్సవంలో బండ్ల వేషాలు



అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

సాలూరు: నందెన్న అనుపోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మేరకు పట్టణంలోని వడ్డి వీధిలో కొలువుదీరిన నందెన్న అనుపోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ బండ్ల వేషాలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో అనుపోత్సవం సాగింది. వేలాది మంది భక్తుల రాకతో స్థానికంగా ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది.

హోరెత్తిన రామ నామస్మరణ

పాలకొండ: మండలంలోని కొండాపురంలో రామ నామస్మరణ హోరెత్తింది. అయోధ్య రామ జన్మభూమి అక్షింతలు, కలశం శుక్రవారం గ్రామానికి చేరుకోవడంతో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక రామమందిరంలో కలశం ఉంచి ప్రత్యేక పూజలు చేవారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొండాపురంలో కలశం ఊరేగింపు

ఓటుహక్కు తప్పనిసరి



ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: అర్హులందరూ ఓటుహక్కు పొందడంతో పాటు ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. కళాశాలలో రెవెన్యూ అధికారుల నేతృత్వంలో ఓటుహక్కు నమోదుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటును వజ్రాయుధంగా వినియోగించుకుని మంచి నాయకులను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు నరసింహరావు, పి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు



పాలకొండ రూరల్: వ్యాసరచన పోటీలో నిమగ్నమైన విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ ఎ.సునీత ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకులం, కేజీబీవీ విద్యార్థులు చిత్రాలు వేశారు. మహిళా పోలీస్ చందన పట్నాయిక్, గురుకుల టీచర్లు ఆర్.అనసూయ, పి.శ్యామల పర్యవేక్షణలో పోటీలు సాగాయి.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పాలకొండ రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం సమకూరుతుందని స్థానిక వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి. పరాంకుశంనాయుడు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు స్థానిక లైబ్రేరియన్ బబ్బూరు గణేష్‌బాబు ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.